అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలి

ధర్నా చౌక్‌లో యూనియన్ అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు డిమాండ్



ఇందిరాపార్కులో ధర్నా చేస్తున్న విద్యుత్ కార్మికులు

కవాడిగూడ: తెలంగాణ విద్యుత్ సంస్థలైన ఎంపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్‌లలో పనిచేస్తున్న 1607 మంది అన్‌మ్యాన్డ్ కార్మికులను తక్షణమే ఆర్టిజన్స్ కార్మికులుగా గుర్తించాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె. ఈశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. విద్యుత్ సంస్థలలో పనిచేసే అన్‌మ్యాన్డ్ కార్మికులకు ఆర్టిజన్స్ కార్మికులకుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు.

◆ ఈ దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరైన ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ విద్యుత్ సంస్థలు ఎంపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ సంస్థలలో సుమారు 1607మంది అన్‌మ్యాన్డ్ కార్మికులుగా పనిచేస్తున్నారని అన్నారు. గడిచిన ఐదేళ్లలో విద్యుత్ ప్రమాదాలు జరిగి విధి నిర్వహణలో ఇప్పటి వరకు 64మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారికి నష్టపరిహారం కాని, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు గాని ఇవ్వలేదన్నారు.

◆ మరో ఆరుగురు కార్మికులు కరెంటు పోల్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడడంతో వెన్నముక విరిగిపోయి మరికొంత మంది చేతులు కోల్పోయారన్నారు. అప్పటి వరకు వారికి ఇచ్చే రూ.11వేల వేతనానికి బదులుగా స్కిల్డ్ వేతనం రూ.17,598 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు వి. గోవర్ధన్, ఎస్.స్వామి, కె.ప్రభాకర్‌రెడ్డి, పూర్ణాచారి, భానోతురవి, బస్వరాజ్, ప్రసాద్‌తో పాటు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

కాచిగూడ: రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం బర్కత్‌పురలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్తరారాధన విశేష పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నిర్మల్య విసర్జనం, అస్టోత్తర పారాయణం, పాదపూజ, విశేష పంచామృతం, తులసి అర్చన, అలంకార, హస్తోదక, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. బర్కత్‌పుర పురవీధుల్లో మహా రథోత్సవం భజనలు, భక్తి గీతాలాపనలు, మహిళలు, యువతులు, ఇల్లల నృత్యాలతో అంగరంగ వైభవంగా సాగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

బృందావన సమితిలో...

లింగంపల్లిలోని రాఘవేంద్ర బృందావన సమితిలో జరిగిన పూజలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను విద్యాధీశ తీర్థ శ్రీపాదుల స్వామిజీ ఆశీర్వదించారు. మఠం మేనేజర్ కొడూరి సూర్య చంద్రశేఖర శర్మ, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, రాజ్‌కుమార్ విగ్ తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురలోని మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో పూజలు చేస్తున్న అర్చకులు



బర్కత్‌పురరాఘవేంద్ర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామిజీ నుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బీసీ కులాల లెక్కలు తేల్చాల్సిందే !

కాచిగూడ: రాష్ట్రంలో కుల జనగణన చేసి బీసీల లెక్కలు తేల్చితేనే ఆర్థిక, రాజకీయ, సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీల లెక్కలు తేల్చితేనే ఎంతమంది అగ్రకులాల జాబితాతో పాటు బీసీల జాబితా గురించి ప్రజలకు తెలుస్తుందన్నారు. బీసీలు ఆత్మగౌరవ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీసీల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి బీసీల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు నందగోపాల్, వేముల రామకృష్ణ, మల్లేష్‌యాదవ్, ఉదయ్ నేత, రాజశేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

కాచిగూడ: కుద్బిగూడ, చెప్పల్‌బజార్ ప్రాంతాల్లో తాగునీటి నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానిక ప్రజలు తెలిపారు. గురువారం జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా ప్రాంతాలను గుర్తించి సమస్యను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్, బీజేపీ నేతలు సాయిబాబా, నాగరాజు, రామకృష్ణ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక మహిళా రోగులకు సయోధ్య చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ డా.బాలస్వామి

అంబర్‌పేట: మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సయోధ్య మైత్రీ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ చేయూతనిస్తుందని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. హెచ్‌సీఎస్‌సీ, ఓయూ సైకాలజీ విభాగం సహకారంతో సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేటలో మిత్ర మానసిక వ్యాధుల గుర్తింపు, శిక్షణ, సిఫార్సు, అవగాహన కార్యక్రమాన్ని డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సయోధ్య మిత్ర చేపట్టింది చాలా మంచి కార్యక్రమమన్నారు. ఈ శిక్షణలో మానసిక ఆరోగ్య సమస్యల ముందస్తు సంకేతాలను గుర్తించడానికి 100 మందికి శిక్షణ ఇస్తున్నామని అన్నారు. శిక్షణ పొందిన వారు తర్వాత మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తారని తెలిపారు. ఈ ప్యానెల్ వారికి సరైన చికిత్స వైపు మార్గనిర్దేశం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ శేఖర్‌రెడ్డి, ఓయూ సైకాలజీ హెచ్‌ఓడీ డా. స్వాతి, గీత గోటి, ప్రశాంత్, మృదుల, ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, కానిస్టేబుళ్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫ్యామిలీ కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలి



ఓటర్ నమోదు ప్రక్రియపై పార్టీల నేతలతో సమావేశమైన డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో ఓటర్ జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదుకు సహకరించాలని వివిధ రాజకీయ పార్టీల నేతలను డీఎంసీ మారుతీ దివాకర్ కోరారు. గురువారం సర్కిల్-16 కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు జాబితాను రూపొందించామని తెలిపారు. ఈ జాబితాలో అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బోగస్ ఓటర్లను సహితం తొలగించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆయన కోరారు.

కేశవ్ మెమోరియల్ కాలేజీలో పీజీ కోర్సులు

కాచిగూడ: కేశవ్ మెమోరియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ సైన్స్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి రెండు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఎమ్మెస్సీ కంప్యూటర్స్, బయో టెక్నాలజీని ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శాంతి తెలిపారు. గురువారం నారాయణగూడలోని కళాశాలలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన రీతిలో విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల విభాగంలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీలలో వివిధ స్పెషలైజేషన్లలో విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏటా విద్యా విధానాలు, కోర్సులను నిత్య నూతనంగా రూపు దిద్దుకుంటూ.. విద్యార్థుల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా కళాశాల పనిచేస్తోందని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

శుభాకాంక్షలు

నల్లకుంట: ఇటీవల ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన ప్రొ. కోదండరాంను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దసాని వెంకటరాంరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్, లక్ష్మణ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



శ్రీధర్‌చారి

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన శ్రీధర్‌చారి ఆల్ ఇండియా శ్రీవిరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గురువారం ఫెడరేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి శ్రీనివాస్‌చారి, జిల్లా ఇన్‌చార్జి లక్ష్మీనర్సింహ్మా, సేవానచారి ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. యువత పెడదారి పట్టకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేలా తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన ఫెడరేషన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలిక అదృశ్యం

కాచిగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ, కృష్ణానగర్‌కు చెందిన అబిద్‌ఖాన్, అశ్విని దంపతుల కుమార్తె అంబిక (15) ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోంది

మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు



మాట్లాడుతున్న సీనియర్ కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావు, తోలుపునూరి కృష్ణాగౌడ్

కాచిగూడ: రాజ్యాంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు ఆరోపించారు. గురువారం గన్‌పార్క్ నుంచి ఈడీ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీకి వీహెచ్ ఆధ్వర్యంలో అంబర్‌పేట నుంచి కాంగ్రెస్ నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసి దేశ సంపదను అదానీ, అంబానీలకు అక్రమంగా కట్టబెడుతున్నారని అన్నారు. అడ్డుకున్న ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ, ఐటీ రాజ్యాంగ సంస్థలను ఉపయోగించుకుంటూ ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ మేగా కుంభకోణంపై విచారణ జరపాలని, సెబీ చైర్మన్ అక్రమాలపై జేపీసీ వేయాలని, సెబీ చైర్మన్ రాజీనామా చేయాలని, దోషులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, కాంగ్రెస్ నేతలు తోలుపునూరి కృష్ణగౌడ్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, అప్సర్, యూసుఫ్, లకుపతి యాదగిరిగౌడ్, యాసిన్ షరీఫ్, లక్ష్మణ్, చందు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి: అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 23 నుంచి మండల కేంద్రాలు, 27 నుంచి జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నామని, రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గురువారం ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ.. రెండు లక్షల లోపు రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులుండగా.. 42 లక్షల మందికే బ్యాంకులు రుణాలిచ్చాయని ఇందులో రూ.22 లక్షల మందికే మాఫీ జరిగిందన్నారు. నేతలు సారంపల్లి మల్లారెడ్డి, బాలకృష్ణ, వెంకటాచారి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను అవిష్కరిస్తున్న సాగర్ తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అడిక్‌మెట్‌లో పర్యటిస్తున్న జలమండలి అధికారులు

ముషీరాబాద్: గత మూడేళ్లుగా అడిక్‌మెట్ డివిజన్‌లోని అభయ ఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న గల్లీలో డ్రైనేజీ, తాగునీటి కాలుష్య సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించగా.. ఎండీ కల్పించుకుని కొంత మేరకు సమస్యను పరిష్కరించినా.. గత కొంతకాలంగా అదే సమస్య మళ్లీ మొదటికొచ్చిందన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు చిలకలగూడ జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్‌కుమార్ గురువారం బస్తీల్లో పర్యటించి సమస్యను ప్రత్యక్షంగా చూశారు. ఈ సమస్య పరిష్కారానికి రూ.12 లక్షల నిధులు మంజూరయ్యాయని, వెంటనే టెండర్లను పిలిచి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు స్థానిక బస్తీ నాయకులు తెలిపారు. శ్రీనునాయుడు, డానియల్, అశోక్, చంటి, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌సింగ్‌కు పరామర్శ



చిక్కడపల్లి: ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వచ్చిన బీజేపీ సీనియర్ నేత ఠాగూర్ విష్ణువర్ధన్‌సింగ్‌ను గురువారం సాయంత్రం రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ కలసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నేతలు రత్న సాయిచంద్, రాజాగౌడ్, రమేష్‌రామ్, శ్రీకాంత్, శ్రీనివాస్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు ఎంతో భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం 12 మంది లబ్ధిదారులకు రూ.5.50 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి తన వంతు చేయూతను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ తీసుకుంటానని అన్నారు.

పార్టీ అభ్యున్నతికి పాటుపడే వారికే పదవులు

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న కుషాల్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్: పార్టీ అభ్యున్నతి కోసం క్రమశిక్షణతో కష్టపడే వారికే పార్టీ ఉన్నత పదవులతో పాటు నామినేటెడ్ పోస్టులు లభిస్తాయని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎం.నర్సింగ్‌రావు తనయుడు ఎం.కుషాల్‌గౌడ్ బీజేవైఎం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేందర్, శ్యాంసుందర్ గౌడ్, రమేష్ రామ్, ఆయుష్‌రాజ్, రాజా గౌడ్, శివగౌడ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

చిక్కడపల్లి: సామాజిక సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ పీఆర్‌ఓ లయన్ జీకే రమణ, సామాజిక సేవకుడు సాయిరితీష్‌ల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. చిక్కడపల్లి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఈవో మాచర్ల దేవనాథం, లయన్ ఎస్ఎన్ మూర్తి, లయన్ రఘు, పీవీ సాయి, రామచంద్రరావు, జి.రత్నాకర్, యమున, కల్పన, నరసింహారావు, విజయ దుర్గ, సతీశ్ , సాయి కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వివేకానగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

మేయర్‌కు ఔట్‌సోర్సింగ్ కార్మికుల కృతజ్ఞతలు



మేయర్ విజయలక్ష్మికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆకుల శ్రీనివాస్, యూనియన్ సభ్యులు

కాచిగూడ: జీహెచ్ఎంసీ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకున్న నగర మేయర్, గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలిని గురువారం జీహెచ్ఎంసీ జేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీలో ఎస్ఎఫ్ఏలు మూడు సమయాల్లో హాజరును తీసివేసి రెండు సమయాలకు పరిమితం చేయాలని కోరామన్నారు. ప్రతి నెల 30 లీటర్ల పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. శానిటరీ ఫీల్డ్ కుటుంబాల పీఎఫ్, ఈఎస్ఐకి ఒక నిఘా విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. గ్రూపులలో పనిచేస్తున్న సిబ్బందికి సరైన పర్యవేక్షణ లేక ట్యాక్స్ కట్ అవుతోందన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సానిటరీ గ్రూప్‌కు ఈ-రిక్షా, ట్రై సైకిల్, వీల్ బ్యారెల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కార్మికుడికి సానిటరీ కిట్ ఇవ్వాలన్నారు.

హస్తకళలను ఆదరించాలి



చేనేత వస్త్రాలను తిలకిస్తున్న టీహెచ్‌డీసీ చైర్మన్ నాయుడు సత్యనారాయణ

కవాడిగూడ: దేశంలోని పలు రాష్ట్రాలలో చేనేత డ్వాక్రా మహిళలను ఆధరించాలని తెలంగాణ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీహెచ్‌డీసీ) చైర్మన్ నాయుడు సత్యనారాయణ అన్నారు. గురువారం ఎన్‌టీఆర్ స్టేడియంలో శ్రీసాయి స్వశక్తి మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీసాయి చేనేత కాటన్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల వృత్తి కళాకారులకు సంబంధించిన చేనేత వస్త్రాలు, ఇతర వస్తువులు అద్భుతంగా రూపొందించారని ఆయన కొనియాడారు. నిర్వాహకురాలు ఖమ్మంపాటి పద్మజ మాట్లాడుతూ... ఈ ప్రదర్శన అన్ని సెలవు దినాలతో పాటు సెప్టెంబర్ 29 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

గొప్ప దార్శనికుడు రాజాబహదూర్ వెంకట్రామారెడ్డి

ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో జయంతి వేడుకలు



జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ వసుంధర

కాచిగూడ: తెలంగాణలో తెలుగు బాష, విద్యా వ్యాప్తి, స్త్రీ విద్యకోసం కృషి చేసిన దార్శనికుడు రాజా బహదూర్ వెంకటరామారెడ్డి అని హైదరాబాద్ మహిళా విద్యా సంఘం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వసుంధర అన్నారు. బర్కత్‌పురలోని ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో గురువారం వెంకట్రామారెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీవీఆర్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... శాంతి భద్రతలు కాపాడటంలో నేటి పోలీసులకు రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఆదర్శనీయమని అన్నారు. నిజాం పాలనలో తెలంగాణ ప్రాంతానికి రాజా బహదూర్ వెంకటరామారెడ్డి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. నిజాం ప్రభుత్వంలో హైదరాబాద్‌కు కొత్వాల్‌గా పనిచేసిన ఆయన తన సొంత ఆస్తులను విక్రయించి తెలంగాణలో విద్యావ్యాప్తికి అనేక విద్యాలయాలు నెలకొల్పారని, సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు. ఆయన చేసిన సేవలకు నిజాం ప్రభుత్వం రాజా బహదూర్ బిరుదును, బ్రిటీష్ ఆర్డర్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్ బిరుదులతో సత్కరించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. జె.అచ్యుత దేవి, ప్రొ. ముత్యంరెడ్డి, ప్రొ. సుదర్శన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ కె.సిందూరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన



గార్డ్ ఆఫ్ ఆనర్ చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

సృజనోత్సవం



బృంద గానం ఓపెన్ కాంపిటేషన్‌లో ట్రోఫీ అందుకున్న ఆనందంలో శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు

నల్లకుంట: స్వర మహతి కళా పరిషత్ ఆధ్వర్యంలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గురువారం సృజనోత్సవ-2024 జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో పోటీలను నిర్వహించారు. దేశవ్యాప్తంగా 2వేల మందికి పైగా పాల్గొన్న ఈ పోటీల్లో పాల్గొన్న నల్లకుంటలోని శ్రీ సాయిశృతి మ్యూజిక్ అకాడమీకి చెందిన 50 మంది విద్యార్థులు సంగీతంలో అన్ని విభాగాల్లోనూ ప్రతిభను చాటారు. బుధవారం సాయంత్రం నగరంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కప్, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలుగు భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు విజేతలకు కప్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి, కళాశాల ప్రిన్సిపాల్, టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరిభట్ల లక్ష్మణామూర్తి, వర్ధమాన గాయనీమణులు నందిని, యామిని తదితరులు పాల్గొన్నారు.